బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 14 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


# లగచర్ల ఘటనలో అరెస్టులు

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వికారాబాద్ జిల్లా లగచర్ల దాడి ఘటనలో బుధవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికారులపై దాడి ఘటనలో కుట్ర ఉందనే ఆరోపణలతో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఆయన వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అరెస్ట్ చేశారు. సాయంత్రం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి ఈనెల 27వరకు 14 రోజుల రిమాండ్ విధించారు.

అంతకుముందు వికారాబాద్ పోలీస్ శిక్షణ కేంద్రంలో 3 గంటల పాటు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణ రెడ్డి విచారించారు. నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్?ఎస్ శ్రేణుల ఆందోళనల దృష్ట్యా వికారాబాద్ శిక్షణా కేంద్రం నుంచి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరిగి పోలీస్‌స్టేషన్లో మరింత సమాచారం సేకరించిన అనంతరం కొడంగల్‌కు భారీ బందోస్తు మధ్య నరేందర్ రెడ్డిని తీసుకెళ్లారు. అక్కడి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. లగచర్ల దాడి కేసులో పోలీసులు ఇప్పటి వరకు 21మందిని అరెస్టు చేశారు.

కాగా, ఘటనతో ప్రత్యక్ష సంబంధం ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు సురేష్ పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. అతను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు కావడంతో మాజీ ఎమ్మెల్యేపై పోలీస్ ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. బుధవారం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి దాడి ఘటనలో ఏ1 నిందితునిగా చేర్చారు. అయితే, రిమాండ్ రిపోర్టులో.. ఈ ఘటన వెనుక ఉన్న ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బీఆర్ఎస్ ముఖ్యనాయకులపైనా ఆరోపణలు రావడంతో వారి పేర్లు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, గ్రామంలో ఇప్పటికీ ఇంటర్‌నెట్ రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, పోలేపల్లిలో ఈ నెల 11న ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. కాగా, లగచర్ల గ్రామ శివార్లలో.. గ్రామ సభ ఏర్పాటు చేయగా.. గ్రామానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడాలని అధికారులను తీసుకెళ్లిన సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నేతలతోపాటు దాదాపు 46మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు.



## జార్ఖండ్‌లో మొదటి విడతలో 64.86 శాతం పోలింగ్

### వాయనాడ్ లోక్‌సభకు 60.79 శాతం ఓటింగ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జార్ఖండ్ అసెంబ్లీ తొలి విడత ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జార్ఖండ్‌లో మొత్తం 81 స్థానాలకు గానూ 43 అసెంబ్లీ స్థానాలకు బుధవారం మొదటి విడత పోలింగ్ జరిగింది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం హేమంత్ సోరెన్ తన సతీమణి కల్పనతో కలిసి రాంచీలో ఓటు వేశారు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తన సతీమణి సాక్షితో కలిసి రాంచీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధోనీ రాకతో పోలింగ్ కేంద్రం వద్ద సందడి నెలకొంది. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానంతో పాటు దేశంలోని 10 రాష్ట్రాల్లో 31 అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ టర్నవుట్ యాప్ ప్రకారం.. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 64.86శాతం పోలింగ్ నమోదైంది. వాయనాడ్‌లో 60.79 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినా క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం మరింతగా పెరిగే అవకాశముంది.

రాజస్థాన్‌లో ఏడు సీట్లు కాగా.. పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అసోంలో ఐదు, బీహార్‌లో నాలుగు, కేరళలో మూడు, మధ్యప్రదేశ్‌లో రెండు, మేఘాలయ, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, కర్నాటకల్లో ఒక్కో సీటుకు చొప్పున బుధవారం ఉప ఎన్నికలు జరిగాయి. జార్ఖండ్‌లో తొలి విడత నిర్వహించిన ఎన్నికల్లో జేఎంఎం నుంచి 23 మంది పోటీ చేయగా.. మిత్రపక్షాలైన కాంగ్రెస్ నుంచి 17 మంది, ఆర్జేడీ నుంచి ఐదుగురు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి 36 మంది అభ్యర్థులు బరిలో దిగగా.. జేడీయూ నుంచి ఇద్దరు పోటీ చేశారు. బీఎస్పీ నుంచి ఏడుగురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

తొలి దశలో మాజీ సీఎం చంపయీ సోరెన్, మాజీ సీఎం మధు కోడా భార్య, మాజీ ఎంపీ గీతా కోడా సహా 683 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 20న రెండో విడత పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి.

## నిర్వాసితులకు భారీ ఎత్తున పరిహారం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫార్మా కంపెనీల ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న లగచర్ల వాసులకు భారీ ఎత్తున పరిహారం ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. బుధవారం సెక్రటేరియట్ లో ఆయన మీడియాతో మాట్లాడారు.

పారిశ్రామిక ప్రగతితోనే ప్రపంచంతో పోటీ పడగలమని అన్నారు. కొడంగల్ ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. పరిశ్రమలు రావాలంటే భూసేకరణ తప్పనిసరి అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అమాయక గిరిజనులను రెచ్చగొట్టి కలెక్టర్ పై దాడికి ఉసిగొల్పాయన్నారు. కలెక్టర్, అధికారులపై దాడితో సమస్యలు పరిష్కారం కావాని, చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. కలెక్టర్ పై దాడి చేసినంత మాత్రాన ఫార్మా ఇండస్ట్రీ ఏర్పాటు నుంచి వెనక్కి తగ్గబోమన్నారు. భూములు కోల్పోతున్న రైతుల బాధ తమకు తెలుసు అన్నారు. రైతుల బాధను తమ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని, భూములు కోల్పోతున్న వారికి మెరుగైన ప్యాకేజీ ఇవ్వడంతో పాటు ఉద్యోగాలు కల్పిస్తామని, ఇండ్లు కోల్పోతున్న వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తామన్నారు. కుట్రపూరితంగానే బీఆర్ఎస్ శ్రేణులు కలెక్టర్ పైకి దాడికి గిరిజనులను ఉసిగొల్పాయన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం బీఆర్ఎస్ కు ఇష్టం లేదా చెప్పాలన్నారు. ప్రాజెక్టుల కోసం బీఆర్ఎస్ భూసేకరణ చేస్తే కాంగ్రెస్ పార్టీ ఏనాడు కాదనలేదని తెలిపారు. ఉద్యమ సమయంలో రెచ్చగొట్టి అమాయకులు ప్రాణాలు కోల్పోయేలా చేశారని, ఇప్పుడు అలాగే రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిర్వాసితులందరికీ భారీ ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇళ్లను సైతం కోల్పోతున్న వారికి మంచి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కూడా ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు.

## గ్రూప్-3 పరీక్షలు.. నర్సింగ్ కాలేజీల ప్రారంభంపై సీఎస్ సమీక్ష




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లు, వరి-పత్తి కొనుగోళ్ల పురోగతి, కొత్త నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ప్రారంభం, సామాజిక ఆర్థిక సర్వే తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 5.36 లక్షల మంది విద్యార్థులు గ్రూప్-3 పరీక్షలకు హాజరవుతున్నారని సీఎస్ పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. గ్రూప్-1 పరీక్షల మాదిరిగానే గ్రూప్-3 పరీక్షలను కూడా సజావుగా, సక్రమంగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు స్వయంగా పర్యవేక్షించి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు ఉండేలా చూడాలని, ఫూల్ ప్రూఫ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి పరీక్షల నిర్వహణకు కమిషన్ చేసిన ఏర్పాట్లను సంక్షిప్తంగా వివరించారు. పరీక్షలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కలెక్టర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రస్తావిస్తూ, కలెక్టర్లు వరిధాన్యం రాకను ప్రతిరోజూ నిశితంగా పరిశీలించాలని.. వరి దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్లు జరిగేలా జాగ్రత్త వహించాలన్నారు. ఈ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా వరి దిగుబడి వస్తున్నందున క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. గోదాములకు ధాన్యం రవాణా చేయాలని, త్వరగా చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్లను కోరారు. ప్రత్యేక అధికారులు తమ నిర్దేశిత జిల్లాల్లో వరి తరలింపును పర్యవేక్షించాలని, సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా సమస్యలను పరిష్కరించి రైతుల్లో విశ్వాసాన్ని నింపాలని, అధికారులందరూ తప్పనిసరిగా ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆమె ఆదేశించారు. కొత్తగా మంజూరైన నర్సింగ్, పారామెడికల్ కాలేజీలకు సంబంధించి మిగిలిపోయిన మరమ్మతు పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సామాజిక ఆర్థిక కులాల సర్వే సజావుగా జరిగినందుకు కలెక్టర్లను ఆమె అభినందించారు.

## ధాన్యం దళారుల పాలైంది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలైందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏపేగత సంవత్సరం నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీళ్లు రావడం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. సాగు పెరిగిన కారణంగా నల్గొండ జిల్లాలో ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంచనా వేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేసే పరిస్థితి నల్గొండ జిల్లాలో లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలయింది. సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేక, గన్నీ బస్తాలు అందించలేక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు రూ .1800లకు క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేను అడుగుతున్నాను ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసి రైతులకు 500 బోనస్, 15000 రైతుబంధు ఇస్తానని చెప్పి మాట తప్పవా లేదా? రైతుల వద్ద లోడ్ ఎత్తమంటే మహారాష్ట్రకు నోట్లో కట్టల లోడ్ ఎత్తుతున్నాడు ముఖ్యమంత్రి. నల్గొండ జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, 200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటే అందులో 50 కోట్లు మాత్రమే చెల్లించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదు.

వడ్లకు మద్దతుధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేసిన పరిస్థితి. కొన్న వడ్లకు కూడా విపరీతంగా తరుగు పెట్టి రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. నిన్న జగిత్యాల జిల్లా పర్యటనలో అక్కడి రైతులని అడిగితే ఒక కిలో సన్నవడ్లు కూడా కొనలేదని చెప్పారు.ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో కూడా ఒక కిలో సన్న వడ్లను కొనలేదు.సన్న వడ్లను కొనే వ్యవస్థ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విఫలమైంది.ముఖ్యమంత్రికి ఈ మధ్య మద్యం అమ్మకంపై ప్రేమ ఎక్కువైంది.వడ్లు కొనకపోతే అధికారులను మిల్లర్లను ఎందుకు కొనట్లేదని అడగడం లేదు కానీ. మందు తక్కువ అమ్మిన ఎక్సైజ్ అధికారులకు మెమోలు ఇస్తున్నారు.మందు అమ్మకాల టార్గెట్ పెట్టి జనాలకు మందు ఎక్కువ తాగించి ఆదాయం పెంచాలని ఒత్తిడి చేస్తూ మెమోలిస్తూ ట్రాన్స్ఫర్లు చేస్తున్నారు.25 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లకు మెమో జారీ చేశారు.తెలంగాణను తాగుబోతుల తెలంగాణ చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు.ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు కానీ మద్యాన్ని ఏరులై పారిస్తామని కంకణం కట్టుకున్నాడు. తెలంగాణలో ఆడబిడ్డలకు 2500 రూపాయలు ఇస్తానని ఎన్నికల హామీ ఇచ్చావు కానీ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేసి మహిళల పుస్తెల్లు తెంపుతున్నావ్. మహిళలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణమిస్తామని చెప్పి మోసం చేసావ్. వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మహిళలకు అందజేయడం లేదు. భర్తలకు మద్యం తాగించి ఇల్లు గుల్ల చేయాలని చూసి మహిళలను ఇబ్బంది పెడుతున్నావ్.

ముఖ్యమంత్రి ప్రజల గురించి కాకుండా పైసల గురించి మాత్రమే ఆలోచిస్తున్నాడు. రైతులకు పెట్టుబడి సాయం అందిందా లేదా రుణమాఫీ జరిగిందా లేదా సకాలంలో బోనస్ అందించారా లేదా, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశారా లేదా అనే సోది లేదు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని ప్రభుత్వం ప్రకటించింది కానీ ప్రభుత్వ పరిస్థితి చూస్తుంటే 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనే పరిస్థితి లేదు. పక్క రాష్ట్రం నుంచి దళారుల వచ్చి తెలంగాణలో రైతుల వద్ద తక్కువ రేటుకు ధాన్యాన్ని కొంటున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు పెట్టి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని మోసం చేసావ్. రేవంత్ రెడ్డి రాజ్యంలో రైతు దుఃఖపడుతున్నాడు. ధాన్యం కొనుగోలులోనే కాదు పత్తి కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 15000 రూపాయల రైతుబంధు రైతులకు ఇవ్వాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు.

## అల్లుడి కంపెనీ కోసమే రైతులపై సీఎం దౌర్జన్యాలు




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తన అల్లుడి కంపెనీ కోసమే రైతులపై సీఎం రేవంత్ రెడ్డి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ ఆదేశాలతో కొడంగల్ రైతులను అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టిన పోలీసులు.. రిమాండ్‌కు తరలిస్తుంటే రైతులు నడవలేకపోయారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

రైతులకు మెడికో లీగల్ పరీక్షలు వెంటనే చేయాలి.. ప్రభుత్వ వ్యవస్థ మీద నమ్మకం లేదు కాబట్టి ప్రైవేట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహించాలని మేజిస్ట్రేట్‌ను కేటీఆర్ కోరారు. ముఖ్యమంత్రి సోదరుడు తన్ని తీసుకుంటామని రైతులను బెదిరించిన ఆడియో ఉంది. ఫార్మా విలేజ్ వద్దని కొడంగల్ రైతులు సీఎం ను, మమ్మల్ని, బీజేపీ వాళ్లను కూడా కలిశారు. కొడంగల్ రగలుతుండటానికి ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాలోచిత నిర్ణయాలే కారణం. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన చందంగా ఉంది ఈ ప్రభుత్వం తీరు అని కేటీఆర్ మండిపడ్డారు. సొంత నియోజకవర్గంలో రైతులు అరెస్ట్ అవుతుంటే సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో ప్రచారానికి వెళ్లాడు. జాతీయ కాంగ్రెస్ నేతలకు తాబేదారుగా వ్యవహరిస్తూ ఇక్కడ పాలన గాలికి వదిలేశాడు. పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయలేదు కిడ్నాప్ చేశారు. ఆయనేమైనా బందిపోటా? భూసేకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, పేద బీసీల భూములను రేవంత్ రెడ్డి తన అనుచరులు, కుటుంబ సభ్యులకు ఇచ్చి రియల్ ఎస్టేట్ దందా చేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొడంగల్‌లో ఇంటర్నెట్‌ను బంద్ పెట్టారు. అసలు ఇంటర్నెట్ బంద్ చేయటానికి వీలు లేదు. ఏ విధంగా పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేస్తారు. రైతులను లాక్కొని అర్ధరాత్రి పూట అరెస్ట్ చేశారు. ఇంట్లో వేడుకలు, కార్యక్రమాలు ఉన్నప్పటికీ రైతులను అరెస్ట్ చేసి వాళ్లను ఇబ్బంది పెట్టారు. ఇది పేదలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం. ఇది ఊరికే నేను చెప్పటం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అల్లుడికి చెందిన మ్యాక్స్ బీఎన్ కంపెనీ విస్తరణ కోసమే రైతుల భూములను తీసుకుంటున్నారు. అన్నం శరత్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. ఆయన మెడికవర్ హాస్పిటల్ ఓనర్. మెడికవర్ హాస్పిటల్ ఓవర్ అన్నం శరతే. ఆయన అల్లుడు, రేవంత్ రెడ్డి అల్లుడు ఇద్దరు ఒకే సంస్థలో డైరెక్టర్లు. వాళ్లిద్దరి కోసమే ఫార్మా విలేజ్ పేరుతో అక్రమాలు చేసేందుకు ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడు. బెంగళూరులోనూ మెడికవర్ హాస్పిటల్‌ను అక్కడి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రారంభించారని కేటీఆర్ గుర్తు చేశారు.

ఈ ముఖ్యమంత్రి భరతం పట్టే పనిని కొండగల్ నుంచే మొదలు పెడతాం.. మా పార్టీ వాళ్లందరం కొడంగల్ వెళ్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

పట్నం నరేందర్ రెడ్డిని, రైతులను ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పాలి. ఆయననేమైనా టెర్రరిస్టా? నరేందర్ రెడ్డి భార్యకు పోలీసులు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కోర్టులో ఈ దుర్మార్గాలపై పోరాటం చేస్తాం. రైతులకు అండగా ఉంటాం. మీ ఆనాలోచిత నిర్ణయాలను మానుకోండి. ఫార్మా విలేజ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఫార్మా సిటీ విషయంలో వీళ్లు హైకోర్టును కూడా మోసం చేస్తున్నారు. బయట ఫార్మా సిటీ రద్దు అంటున్నారు. కోర్టులో మాత్రం ఫార్మా సిటీ ఉందని చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూములను వేరే అవసరాలకు వాడటానికి వీలు లేదు. ఫార్మా సిటీ పేరుతో ఫోర్త్ సిటీ, స్కిల్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. అవసరం లేని చోట కూడా భూములు కొని రోడ్లు వేస్తూ ఇన్ సైడర్ ట్రేడింగ్ చేస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల కంపెనీల బాగోతాన్ని ధారావాహిక మాదిరిగా బయటపెడుతూనే ఉంటాం. ఫార్మా విలేజ్ పేరుతో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేసే నిర్ణయాన్ని మానుకోండి. ఫార్మా సిటీ కోసం రైతులు ఇచ్చిన భూమిని వారికి తిరిగి ఇస్తామని మాట ఇచ్చారు. ఎప్పుడు ఇస్తారో తేదీ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ఏర్పాటు కారణంగా.. సురేశ్ అనే బీఆర్ఎస్ కార్యకర్త 7 ఎకరాల భూమి పోతోంది.. విలువైన భూమి పోతదంటే అడగడం తప్పా..? అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను కేటీఆర్ నిలదీశారు. సురేష్ అనే వ్యక్తి కలెక్టర్ అభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు రైతుల బాధలను ఆయనకు చెప్పాడు. ఎక్కడ కూడా దాడి చేయలేదు. సురేష్ దాడికి పాల్పడినట్లు ఏమైనా ఆధారాలు ఉన్నాయా? సురేష్ అసలు దాడియే చేయలేదు. కడుపు మండి తన భూమి గురించి అడిగాడు. కలెక్టర్‌కు అక్కడి రైతుల సమస్యను వివరించాడు. మా పార్టీ నాయకులు మా వారితో మాట్లాడితే అది కూడా తప్పా? దానికి కేసులు పెడతారా? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు.ప్రశ్నించే గొంతుక అనే కదా నువ్వు కూడా గెలిచింది. మరీ ఇప్పుడు ఎందుకు ప్రశ్నించే వాళ్లను అరెస్ట్ చేస్తున్నారు. రైతులు తమ భూములు కాపాడాలని కోరుతూ అందరినీ కలిశారు. ముఖ్యమంత్రి బిజీగా ఉండటంతో ఆయన సోదరుడిని కూడా కలిశారు. నీ ఆనాలోచిత విధానాలను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా? సురేష్ నాతో వచ్చి కలవటమే తప్పు అయితే రాహుల్ గాంధీ వ్యతిరేకించే అదానీతో రేవంత్ రెడ్డి రాసుకొని పూసుకొని తిరుగుతున్నాడు. మరి దానికి రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలి కదా? సురేష్ ఏం తప్పు చేశాడు. మన నాయకులతో మాట్లాడటమే తప్పా? ఆయన భూమి పోతుంటే మాట్లాడకూడదా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

### ప్రభుత్వ ఆసుపత్రులలో

# ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు..

- **రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ ఆసుపత్రి లో జరుగుతున్న ప్రసవాల పై పి.హెచ్.సిల వారిగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రతి మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలు, సి- సెక్షన్ ప్రసవాలు, అదే సమయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మే నెల నుంచి అక్టోబర్ వరకు 3206 ప్రసవాలు జరగగా, ప్రభుత్వ ఆసుపత్రిలో 1860, ప్రైవేట్ ఆస్పత్రిలో 1308 ప్రసవాలు జరిగాయని అన్నారు .

పిఎస్ నగర్, ఎబి నగర్ అర్బన్ పిహెచ్సి, విలాస్ నగర్, కొదురుపాక, హనుమజీపేట, బోయినపల్లి పి.హెచ్.సి పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచే దిశగా ప్రత్యేక ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా చర్య తీసుకోవాలని అన్నారు.

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీల ప్రసవం తేదీలను అంచనా వేస్తూ జాబితా తయారు చేసుకోవాలని, ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణీ మహిళలను ఎప్పటికప్పు డు ఆశా కార్యకర్తల ద్వారా ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా కార్యకర్తల ద్వారా 100 శాతం గర్భిణీ మహిళల ఏఎన్సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, మహిళలకు సకాలంలో టీకాలు అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అనేమియా ఉన్న గర్భిణీ మహిళ లను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు అందజేయాలనిఅన్నారు .

నవంబర్ నెలలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ప్రసవం జరిగే అవకాశం ఉన్న గర్భిణీ స్త్రీలు మొత్తం 464 మంది ఉన్నారని, ఇప్పటి వరకు జిల్లాలో 204 ప్రసవాలు జరిగాయని అన్నారు. మిగిలిన గర్భిణీ స్త్రీలను ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ ఉండాలని అన్నారు. జిల్లాలో తన అనుమతి లేకుండా నూతన ఆసుపత్రి రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు అనుమతి జారీ చేసేందుకు వీలు లేదని అన్నారు.

ప్రతి పి.హెచ్.సి వారిగా జరుగుతున్న ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సిరిసిల్ల జనరల్ ఆసుపత్రి పరిధిలో చిన్న పిల్లల వైద్యులు, ఇతర విభాగాల అవసరమైన ప్రత్యేక వైద్యులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వైద్య కళాశాల నుంచి 2 గైనకాలాజీ వైద్యులను వేములవాడ ఏరియా ఆసుపత్రికి డిప్యుటేషన్ పై నియమించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. లక్ష్మి నారయణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డా.వసంతరావు, మెడికల్ సూపరింటెండెంట్లు డా.పెంచలయ్య, డా.లక్ష్మి నారయణ,ప్రోగ్రామ్ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# హాస్పిటల్‌లో పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలి..



**బలగం టీవీ , సిరిసిల్ల**

సిరిసిల్ల ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్,పేషెంట్ కేర్ మరియు సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది సంబంధించి పని భారాన్ని తగ్గించి హాస్పిటల్లో పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని కార్మికులు విధులను బహిష్కరించి హాస్పిటల్ ఎమర్జెన్సీ కేర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో దాదాపు ప్రతిరోజు 300 పడకలు పనిచేస్తుండగా, 100 మంది సిబ్బందిని నియమించి పని భారాన్ని పెంచడమే కాక,వీరిలో కొంతమందిని మెడికల్ కాలేజీకి పంపించి అక్కడ కూడా పని చేపిస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు.నెలనెల వేతనాలు కూడా ఇవ్వడం లేదని, మహిళా సిబ్బందిని డాక్టర్స్,సిస్టర్స్ చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. సిబ్బంది చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ మధ్యాహ్న సమయంలో భోజనం కూడా సరిగా చేయనివ్వడం లేదని, హాస్పిటల్ లో తింటే బయటకు వెళ్లి తినాలని వెళ్లగొడుతున్నారని,కనీసం బట్టలు మార్చుకోవడానికి కూడా రూమ్స్ లోకి అనుమతి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని హాస్పిటల్ కి అనుకూలంగా సిబ్బంది నియమించి, పనిభారాన్ని తగ్గించాలని,



# మూడు వాహనాలు సీజ్

### పర్మిషన్ లేకుండా మైనింగ్ తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవు : తాసిల్దార్

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామ శివారులోని ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి తన వ్యవసాయ పొలంలో మైనింగ్ పనులు చేస్తున్నందున మూడు వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తాసిల్దార్ రామచందర్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం బండి లింగంపల్లి గ్రామ శివారులోని డాక్టర్ షఫీ కి సంబంధించిన వ్యవసాయ పొలంలో బర్మా ట్రాక్టర్ ద్వారా బండలను బ్లాస్టింగ్ చేస్తూ జెసిబి సహాయంతో తరలిస్తున్నాడని సమాచారం వచ్చింది. ఎమ్మార్వో తన సిబ్బందితో యుక్తంగా వెళ్లి పరిశీలించి అట్టి వాహనాలను తాసిల్దార్ కార్యాలయం తరలించి సీజ్ చేసి బాధితులపై ఉన్నతాధికారుల సూచన మేరకు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో ఎవరైనా ఎలాంటి పర్మిషన్ లేకుండా మైనింగ్ కార్యకలాపాలు చేసినా, బండలు బ్లాస్ట్ చేసినా చర్యలు తప్పవని తాసిల్దార్ అన్నారు.



# రైతులకు అవగాహన సదస్సు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో వరిలో చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. వరిలో ప్రధానంగ వచ్చే మొగి పురుగు లక్షణాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు.మొగి పురుగు నివారణకు చేపట్టవలసిన చర్యలను తెలియజేయడం జరిగింది.దీని నారుమడి దశలో కార్బ ఫ్యురెన్ 800 గ్రాములు ఒక ఎకరాకి సరిపడే నారుమడిలో నాట్లు వేసే వారం రోజుల ముందు గుళికలను చల్లుకోవాలి. నాట్లు వేసిన పది నుంచి 15 రోజుల వ్యవధిలో కార్బో ఫ్యూరాన్ 3జి 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 8 కిలోలు లేదా క్లోరంత్రీ నీలి ప్రోల్ 4 కిలోలు ఎకరానికి చల్లుకోవాలి.చిరు పొట్ట దశలో నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రా/లీ నీటికి లేదా క్లోరా%శీ%త్రనిలిప్రోల్ 60 మి.లి/ ఎకరానికి పిచికారి చేసుకోవాలి.సుడి దోమ నివారణకు డైనోటెఫ్యూరాన్ 80 గ్రా/ఎకరానికి పిచికారి చేయాలి.అగ్గి తెగులు నివారణకు ట్రిఫ్లాక్సీ స్ట్రోబిన్ మరియు టేబు కొనజల్ 0.5 గ్రా.లీటరు నీటి కలిపి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త డా.ఎం.రాజేంద్రప్రసాద్, డా.కె.మదన్ మోహన్ రెడ్డి శాస్త్రవేత్త మరియు కో ఆర్డినేటర్, డాక్టర్ విజయ్ భాస్కర్, సీనియర్ శాస్త్రవేత్త, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్సై గణేష్

### ప్రతి ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్సై

**బలగం టీవీ , ముస్తాబాద్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ఎస్ఐ గణేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో గౌడ కుల సంఘ సభ్యులు వారి సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం వారి పిలుపు మేరకు ఎస్సై తన సిబ్బందితో వెళ్లి సిసి కెమెరా పరిశీలించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి ఒక్క ఆలయంలో స్థానిక సంఘ సభ్యులు సిసి కెమెరాను ఏర్పాటు చేసుకున్నట్లయితే దొంగతనం జరిగినప్పుడు కానీ ఏదైనా సంఘటన జరిగినప్పుడు వ్యక్తులను గుర్తించడంలో సులువుగా ఉంటుందని వారు అన్నారు. అలాగే ఆలయంలో భక్తులు అందించే కానుకలు హుండీ లో వేసే బంగారు,వెండి ఆభరణాలను, నగదును సంఘ సభ్యులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు జాగ్రత్తలు సూచనలు తీసుకోవాలన్నారు. పోత్కల్ గౌడ కుల సంఘ సభ్యులకు ఎస్ఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం



- ఈ ప్రాంతంలో ఇండ్లను కూల్చబోం
- హైడ్రా చీఫ్ రంగనాథ్

**బలగం టీవీ, హైదరాబాద్**

రెండు నెలల్లో బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకొస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బతుకమ్మకుంట ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతలు ఉండవన్నారు. ప్రస్తుతమున్న ఐదెకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధణ చేస్తామన్నారు. బుధవారం రంగనాథ్ బతుకమ్మ కుంట ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం స్థానికులను కలిసి ఆయన మాట్లాడారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూల్చివేతలు చేపట్టడానికి రాలేదని స్పష్టం చేశారు. బతుకమ్మ కుంటలో మొలిచిన చెట్లను జెసిబితో తో తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న ఏ ఒక్క నిర్మాణాన్ని కూడా కూల్చబోమని హామీ ఇచ్చిచారు. ఇప్పుడు ఉన్న కుంటను అభివృద్ధి చేసి చుట్టూ పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ , హైడ్రా నోటీసులు ఇచ్చే అధికారం ఉందని, హైడ్రా నోటీసులు ఆక్రమణదారులకు వెళ్తూనే ఉంటాయన్నారు. నాగారంలో రోడ్డు కబ్జా చేసి కట్టిన నిర్మాణాలను ఈరోజు కూల్చేశామన్నారు. ఐదు కాలనీలకు వెళ్ళే రొడ్డును ఆక్రమించారని క్లారిటీ ఇచ్చారు. తమకు స్థానికులు కంప్లెయింట్ చేయడంతో సర్వే చేశామన్నారు. 15 ఏళ్లుగా కబ్జాలో ఉన్న నిర్మాణాలు తొలగించామని రంగనాథ్ పేర్కొన్నారు.

**నాగారంలో ఆక్రమణలు కూల్చివేత**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోనీ సిరిపురం కాలనీలో రోడ్డు ఆక్రమణను హైడ్రా అధికారులు కూల్చివేశారు. తమ కాలనీలో రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారంటూ స్థానికులు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు రోడ్డు ఆక్రమణ నిజమేనని నిర్ధారించారు. బుధవారం సిరిపురం కాలనీకి చేరుకున్న రెండు హైడ్రా బృందాలు జేసిబీ సాయంతో ఆక్రమణలు కూల్చివేశారు. రోడ్డు కబ్జా చేసిన పాపి రెడ్డిపై కూడా చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు వెల్లడించారు.

నాగరం ప్రధాన రహదారికి కాలనీల నుంచి నేరుగా వెళ్లేందుకు అవకాశం లభించడంతో 5 కాలనీలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కూల్చివేతలు అనంతరం రహదారిని అక్కడ నిర్మించాలంటూ నాగారం మున్సిపల్ కమిషనర్‌ను కోరిన హైడ్రా. రహదారిని నిర్మించి స్థానిక కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని నాగారం మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించిన నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డిపై కీసర పోలీసు స్టేషన్‌లో హైడ్రా అధికారులు ఫిర్యాదు చేశారు.

# చంద్రబాబుకు ఏజెంట్‌లాగా పనిచేస్తున్న రేవంత్

- ఎంపీ అరవింద్

**బలగం టీవీ, ఇందల్వాయి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రబాబుకు ఏజెంట్ లాగా పనిచేస్తున్నాడని, కానీ పరోక్షంగా కేసీఆర్ తో లోపాయి ఒప్పందం చేసుకొని, కేసీఆర్ కు బినామీగా మారారని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆరోపించారు.బుధవారం ఆయన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణతో కలిసి ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక కాంటా వరి ధాన్యాన్ని తూకం వేయడానికి ఒకటిన్నర కిలోలు వడ్లను కడతా పేరుతో అక్రమంగా తీసుకుంటున్నారని రైతులు ఎంపీ ధర్మపురి అరవింద్ దృష్టికి తేగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుచుకుంటున్నాడని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ చేసిన పనులను చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు రైతుబంధు, రైతు రుణాల మాఫీ, 4000 పింఛన్, ఇందిరమ్మ ఇండ్లను ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

త్వరితగతిన వరి ధాన్యాన్ని రైతుల నుంచి విక్రయించి తక్షణమే డబ్బులను రైతులకు అందించాలన్నారు. కేటీఆర్ ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే తెలంగాణలో ప్రకంపనలు ప్రారంభమయ్యాయని కొందరు నేతలు, కొన్ని పత్రికలు, తన సొంత మీడియా కథనాలు వెల్లడించాయని ఆఅన్నారు. కానీ ఢిల్లీ వెళ్లి ఎవరిని కలిశారో దానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మత్తు పదార్థాల సేవింగ్ ఎక్కువ కావడం వల్లే బాడీలో షేకింగ్ వచ్చిందని, అందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. కేటీఆర్ నార్కో పరీక్షలకు సిద్ధమని ప్రకటించి ఆరు మాసాలు గడుస్తున్నా ఎందుకు నార్కో పరీక్షలు నిర్వహించడం లేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన సవాల్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్ కుమార్, పల్లె గంగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నాయుడు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇంత దారుణమైన దాడులు ఎప్పుడూ జరగలే

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ చరిత్రలో అధికారులపై ఇంత దారుణమైన దాడులు ఎన్నడూ జరగలేదని వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కుట్రతో జరిగిన దాడి అని ఆరోపించారు. లగచర్ల గ్రామస్తుల దాడిలో గాయపడ్డ కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ వెంకట్ రెడ్డిని ఎల్బీ నగర్ ఆర్కేఆర్ ఎన్ క్లేవ్‌లోని శ్రీహర్ష నిలయంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహలు బుధవారం పరామర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. అధికారులపై దాడి తెలంగాణ సంస్కృతి కాదన్నారు. అధికారులపై దాడి విధానాన్ని బీఆర్ఎస్, ఆ పార్టీ నాయకులు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఏనాడు అధికారులపై ఇలాంటి కుట్రలు కానీ.. దాడులు కానీ చేయలేదని గుర్తు చేశారు. దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోన్న బీఆర్ఎస్ నేతలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు నిజంగానే అన్యాయం జరిగే అవకాశం ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్ళాలని.. అంతేకానీ ఇలా అధికారులపై దాడులకు పాల్పడటం సమంజసం కాదని హితవు పలికారు.

# రాంగోపాల్ వర్మకు పోలీసుల నోటీసులు



**బలగం టీవీ, హైదరాబాద్**

సోషల్ మీడియా పోస్టుల కేసులో దర్శకుడు రాంగోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు బుధవారం నోటీసులు అందించారు. వ్యూహం సినిమా ప్రమోషన్ సమయంలో ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కించపరిచేలా రాంగోపాల్ వర్మ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాంగోపాల్ వర్మ నివాసానికి వచ్చిన మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య, పోలీసుల విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారు.తెలుగుదేశం నేత రామలింగం ఫిర్యాదు మేరకు మూడు రోజుల క్రితం మద్దిపాడు పోలీసులు ఆర్జీవీపై కేసు నమోదు చేశారు.


# భుజంగరావు మధ్యంతర బెయిల్ పిటిషన్ కొట్టివేత

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు తనకు మధ్యంతర బెయిల్ ను పొడిగించాలని కోరుతూ నాంపల్లి కోర్టులో వేసిన పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన భుజంగరావుకు అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్ పొందాడు. గురువారంతో ఆయన మధ్యంతర బెయిల్ గడువు ముగియనుంది. దీంతో మధ్యంతర బెయిల్ పిటిషన్ ను కొట్టేసిన నాంపల్లి కోర్టు గురువారం సాయంత్రం 4 గంటల లోపు..తమ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

# ప్రియురాలిని ముక్కలుగా నరికి పొలంలో పాతిపెట్టిన యువకుడు..!



**బలగం టీవీ, హైదరాబాద్**

భద్రాద్రి జిల్లాలో మాచినేనిపేట తండాలో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడు తన ప్రియురాలిని హత్య చేసి ముక్కలుగా నరికి పొలంలో పాతిపెట్టాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.తన కూతురు కనిపించడం లేదని యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. యువతిని ఆమెను ప్రేమిస్తున్న యువకుడే హత్య చేసినట్లు గుర్తించారు.

స్వాతి, ఆమె ప్రియుడు వీరభద్రం..సింగరేణిలో ఉద్యోగం కోసం ఓ కుటుంబం వద్ద రూ.16లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే అప్పు తీర్చే విషయంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వడ్డీలు పెరుగుతుండడంతో అప్పు తీర్చాలని స్వాతి, వీరభద్రంను నిలదీసింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న వీరభద్రం.. ఆమెను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. స్వాతిని చంపి ముక్కలు చేసి గోనె సంచిలో మూట కట్టి పొలంలో పాతిపెట్టినట్లు పోలీసులు విచారణ లో తేలింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. తదుపరి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ చర్యలు



- **నేతన్న కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం**
- **త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూలు డిపో ఏర్పాటు**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబానికి ప్రభుత్వం తరపున రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ లోని నేత కార్మికుడు ఎర్రం కొమురయ్య కుటుంబాన్ని. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కొమురయ్య మరణం చాలా బాధ కలిగించిందని, సిరిసిల్ల చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని, ధైర్యంగా ఉండాలని అన్నారు. మనపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను బాధ పెట్టవద్దని అన్నారు. కొమురయ్య భార్య దివ్యాంగురాలు అని , ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద రెండు లక్షల రూపాయలను కుటుంబానికి అందించామని, ఈ సంఘటన గురించి తెలియగానే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకుని వెళ్లి కుటుంబానికి సహాయం అందేలా చేస్తామని అన్నారు.

నేత కార్మికులు ఎవరు ఒత్తిడికి గురికాకుండా కుటుంబ సభ్యులను చూసుకునేందుకు నిలబడాలని, ఇలాంటి ఘటనలకు ప్రేరేపితులు కావద్దని, ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎటువంటి ఆందోళన అవసరం లేదని అన్నారు. నేత కార్మికులు ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

రాబోయే రోజులలో నేత కార్మికులకు మెరుగైన రీతిలో ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం పదవి బాధ్యతలు తీసుకున్న తర్వాత అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. రైతన్నలు నేతన్నలు నిరుద్యోగ యువత మహిళలు అన్ని వర్గాలకు సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రెండు రోజుల క్రితం భార్యా భర్తలు మరణించిన ఘటన కూడా చాలా బాధ కలిగించిందని , ఆ కుటుంబంలోని పిల్లలకు ఉన్నత చదువులు చదివినందుకు ప్రభుత్వ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఆసాములు, నేత కార్మికులకు పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, వేములవాడ క్లస్టర్ జోన్లు త్వరలోనే నూలు యాడ్ 50 కోట్లతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకుంటామని అన్నారు.

నూలు డిపో ద్వారా 80 శాతం క్రెడిట్ ద్వారా ఆసాములకు అందించి తయారుచేసిన బట్టను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ప్రణాళిక తయారు చేశామని అన్నారు. చేనేత క్లస్టర్ గా ఉన్న మన జిల్లాలో నూలు యార్డు రావడం మనకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. బ్యాంకు ద్వారా చేనేత సంఘాలకు అవసరమైన రుణాలు కూడా అందిస్తామని అన్నారు.నేత కార్మికులకు శాశ్వతంగా మంచి ఉపాధి చూపించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఆత్మహత్య లాంటి నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల తహశీల్దార్ ఎం.ఉమారాణి, ఎడి హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిలక్ వర్మ సెంచరీ.. విక్టరీ కొట్టిన భారత్







**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టీ20లో హైదరాబాద్ అబ్బాయి తిలక్ వర్మ సెంచరీ (107)తో అదరగొట్టాడు. తిలక్ వర్మతో పాటు అభిషేక్ వర్మ కూడా అర్ధ శతకం చేయడంతో భారత్ మూడో టీ20లో ఘన విజయం సాధించింది.

ముందుగా భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. భారీ స్కోరు చేసింది. వన్ డౌన్ బ్యాటర్, తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ సెంచరీతో అదరగొట్టాడు. 56 బంతుల్లో 107 రన్స్ చేసి.. నాటౌట్‌గా నిలిచాడు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. సంజూ శాంసన్ వరుసగా రెండోసారి డకౌట్ అయ్యాడు. మూడో టీ20లో రెండు బంతులాడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ అదిరే ప్రదర్శన చేశాడు. అభిషేక్ శర్మతో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ ఎడాపెడా సిక్సులు ఫోర్లు కొట్టడంతో స్కోరు బోర్డు జెట్ స్పీడులో దూసుకెళ్లింది. దీంతో 8 ఓవర్లు ముగిసే సరికి భారత్ 99/1తో నిలిచింది. ఈ దశలో భారత్ 250 పరుగులు చేసేలా కనిపించింది.


కానీ, అభిషేక్ శర్మ (25 బంతుల్లో 50 రన్స్) ఔట్ అయ్యాక స్కోరు బోర్డు నెమ్మదించింది. సూర్యకుమార్ యాదవ్ (1), హార్దిక్ పాండ్యా (18), రింకూ సింగ్ (8) విఫలమయ్యారు. మిగతా బ్యాటర్లు పెవిలియన్ చేరుతున్నా.. తిలక్ వర్మ మాత్రం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 51 బంతుల్లోనే సెంచరీ మార్కును చేరుకున్నాడు. తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ సెంచరీని నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ మొత్తంగా 56 బంతులు ఎదుర్కొని.. 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 219/6 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. సౌత్ ఆఫ్రికా బ్యాటర్లలో మార్కో యాన్సెన్ 16 బంతుల్లో 5 సిక్సులు, 4 ఫోర్లతో 54 పరగులు, హెన్రిచ్ క్లాసెన్ 22 బంతుల్లో 4 సిక్సులు, ఒక ఫోర్ తో 41 పరుగులు చేశారు. అయితే ఈ జట్టుకు చివరి ఓవర్లో 25 పరుగులు అవసరం కాగా 13 పరుగులు మాత్రమే చేసింది. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3, వరుణ్ చక్రవర్తి 2, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. చివరి ఓవర్లలో పరుగులు పోకుండా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలంగ్ చేశారు . ఈ విజయంతో భారత్ 2-1 తేడాతో సిరీస్‌లో ముందంజ వేసింది. చివరి టీ20 శుక్రవారం జొహన్నెస్‌బర్గ్ వేదికగా జరగనుంది.

# ఉపాధి లేక.. బతుకు బారమై నేతన్న ఆత్మహత్య..

**-ఇంట్లోనే ఉరువేసుకొని ఆత్మహత్య..**

**బలగం టీవీ , సిరిసిల్ల :**



మనిషి నగ్నత్వాన్ని కప్పే ఆరడుగుల వస్త్రాన్ని అగ్గిపెట్టెలో పెట్ట గల నైపుణ్యం ఉన్నా, చేతినిండా పని లేక, ఆర్థిక సమస్యలు,అప్పుల బాధతో సతమతమవుతున్న నేతన్న .పోగు పోగును పోగు జేసి ఉరి తాడు పేనుకుంటున్నాడు. సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర సంక్షోభం నేత కార్మికుల ప్రాణాలను బలిగొంటోంది. గత మూడు రోజుల క్రితం నేత కార్మిక కుటుంబానికి చెందిన దంపతులు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, తాజాగా మరో నేత కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు . ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు అప్పుల బాధలతో నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్థానికు లు తెలిపిన వివరాలు ప్రకారం సిరిసిల్ల పట్టణంలోని గణేష్ నగర్ కు చెందిన ఎర్రం కొమురయ్య(53) పవర్లూమ్ కార్మికుడుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.గత పది నెలల నుండి సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర సంక్షోభం కారణంగా సరైన ఉపాధి సరిగా లేక ఆర్థిక సమస్యలు ఉండడంతో పాటు గతంలోన్న ఉన్న అప్పులు, ప్రస్తుతం చేసిన అప్పులు అధికమవడం, పది నెలల నుండి ఉపాధి లేకపోవడంతో మనస్థాపానికి గురై, మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు పడుకున్న సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయి కిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు.సిరిసిల్ల లో ఏర్పడిన వస్త్ర పరిశ్రమ సంక్షోభం వలన గత పది నెలల నుండి సరైన ఉపాధి లేక నేత కార్మికులు,ఆసాములు అనేక రకాల ఆర్థిక సమస్యలతో సతమతమవుతు, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సిరిసిల్లలో ఉన్న ఆపెరల్ పార్కులో గల ఓనర్ టు వర్కర్ పథకాన్ని అమలు చేస్తే కార్మికులకు ఉపాధి దొరికి ఆత్మహత్యలు పునరావృతం కావుఅని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఓనర్ టు వర్కర్ పథకాన్ని అమలు చేయాలనీ స్థానికులు కోరుతున్నారు.



# రైతులకు అవగాహన సదస్సు

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్లపల్లి మండలం నేరెళ్ళ గ్రామానికి చెందిన తాండ్ర శ్రీనివాస రావు తోటలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు లో సాగు లో మెలుకువలు, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం ,2022-23 సంవత్సరంలో వేసిన రైతులకు 2025 నాటికి దిగుబడి వస్తుందని ఈ తోట సాగు చేస్తున్నపటి నుండి 30వ నెల వరకు పూత తొలగించాలని తెలిపారు.మరియు రైతులందరూ సమయానికి ఎరువులు వాడాలని, తోటలను కలుపు లేకుండా ఆరోగ్యంగా కాపాడుకోవాలని, ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్ గెల ధర 19144 రూపాయలు ఉందని, ఆయిల్ పామ్ టెక్నికల్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. కొత్తగా అయిల్ పామ్ సాగు చేయాలనుకుంటున్నా రైతులు 9154864927,7396667181 సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె ఆ ర్ లత,హార్టికల్చర్ ఆఫీసర్ గోవర్ధన్, అగ్రికల్చర్ ఆఫీసర్ సంజీవ్, ఏఈఓ మౌనిక,జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయిరెడ్డి, ఆఫీసర్ హరీష్, రైతులు పాల్గొన్నారు.



# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్**

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలలో. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అదేశనుసారం బుధవారం రోజున మండలలోని దుండ్రాపల్లి, అనంతపల్లి, కోరేం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులతో మాట్లాడి అడిగి, వారి సమస్యలను తెలుసుకొని, ఐకేపీ నిర్వహులతోని మాట్లాడి, వడ్లను త్వరగా కొనుగోలు చేసి, వరి ధాన్య బస్థాలను తొందరగా అన్లోడ్ చేపించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ బాబు, రోమాల అజయ్, కాంగ్రెస్ నాయకులు జంగ సత్యం, ద్యావ మహిపాల్ రెడ్డి, ప్రేమ్, సంపత్ కుమార్, జంగం పర్శరాములు, మరియు మార్కెట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.